
ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023 5 విజయనగరం



వారానికే లక్ష్యాన్ని పూర్తిచేయాలి

విజయనగరం : ప్రయారిటీ భవనాల నిర్మాణాలను ఏ వారం లక్ష్యం ఆ వారమే పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాకు 3 రకాల భవనాలు కలిపి వారానికి 57 భవనాలను లక్ష్యంగా నిర్దేశించి, వాటిని ఏ వారానికి పూర్తి చేయకపోతే పెండింగ్ కలిపి తరువాత పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. సోమవారం జిల్లా అధికారులు, మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రయారిటీ భవనాలను డిసెంబర్ 10 లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అందుకోసమే వారం వారం లక్ష్యాలను నిర్దేశించామన్నారు. హౌసింగ్ లేఔట్లలో ఇంజినీరింగ్, ప్రత్యేక అధికారులు పర్యటించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పని దినాలను హౌసింగ్ పథకం ద్వారా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెసి మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, పంచాయతీరాజ్ ఇఇ గుప్తా, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, జిఎస్‌డబ్ల్యు కోఆర్డినేటర్ నిర్మలదేవి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఉప కలెక్టర్లు వెంకటేశ్వర రావు, దొర, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనం.. దినదిన గండం

జిల్లాలో మత్స్యకారుల జీవనం దినదినగండంగా మారింది. ఏళ్ల తరబడి ఎదుగూ బొదుగూ లేని వారి జీవితాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. దీంతో సముద్రంలో పట్టిన చేపలకు మార్కెట్ సదుపాయం లేక విలువైన మత్స్య సంపదను దళారులకు నచ్చినంతకు ఇచ్చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగని నిల్వ చేసుకునేందుకూ సదుపాయాలు లేవు. స్థానికంగా జెట్టీ లేదా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ లేకపోవడం వల్ల వేట సమయంలో మత్స్యకారులు ఒడ్డుకు చేరడం కష్టమౌతోంది. నిత్యం ప్రమాదాలకు గురౌతున్నారు. ఇటువంటి సందర్భాల్లో వారి కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోతున్నాయి. మరోవైపు జలాశయాలు, చెరువుల్లో చేపలు పట్టుకునే మత్స్యకారులకు కూడా ప్రభుత్వం నుంచి తగినంత ప్రోత్సాహం లేదు.



- జెట్టీ లేక వలస వేట
- చేపలవేటలో కష్టాలు కడలికే ఎరుక
- మార్కెటింగ్ సదుపాయం కరువే
- నిర్మాణానికి నోచుకోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సుమారు 4,500 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వీరంతా చేపలవేట ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. వీరిలో సుమారు 3,522 కుటుంబాల వారు సముద్రం ఆధారంగా వేట సాగిస్తుంటారు. మైదాన ప్రాంతంలోని జలాశయాలు, చెరువులు ఆధారంగా జీవనం సాగించేవారికి ప్రభుత్వం నుంచి వృత్తిపరమైన ప్రోత్సాహం పెద్దగా అందడం లేదు. ఇక సముద్ర తీర మత్స్యకారులు నిత్యం జీవన్మరణ సమస్యే. వేటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవరకు ప్రాణాలపై నమ్మకం ఉండే పరిస్థితి లేదు. నిత్యం ప్రమాదాలకు గురౌతున్నారు. చేపల జెట్టీ లేకపోవడంతో కనీసం బోట్లు లంగరు వేసుకోవడానికి కూడా వీలు లేకుండా పోతోంది. ఒడ్డున దాచిన బోట్లు తుపానుల సమయంలో సముద్రంలోకి కొట్టుకుపోవడం, వలలు చిరిగిపోవడం పరిపాటిగా మారింది. కానీ, నష్టపరిహారం అంతంతమాత్రంగానే అందుతోందని భోగాపురం, పూసపాటిరేగ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకన్నా ముఖ్యంగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ అంటూ లేకపోవడం వల్ల సముద్రంలోకి చేపలవేటకు వెళ్లి తిరిగి ఒడ్డుకు చేరుతున్న సమయంలో మత్స్యకారులు నిత్యం ప్రమాదాలకు గురౌతున్నారు. వీరిని పట్టించుకునే నాథులు లేరు.

మత్స్యకారుల వలస

పూసపాటిరేగ, పైడిభీమవరంలోని పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల దరిదాపుల్లో జాతైన చేపలు పడడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా సముద్రంలో చాలా దూరం వెళ్లి తెచ్చుకున్న చేపలు కనీసం గంట కూడా నిల్వ చేసుకునేందుకు శీతలగిడ్డంగులు, ఫ్రీడర్లు వంటివి లేవు. స్థానికంగా చేపలమార్కెట్ సదుపాయమూ లేదు. కనీసం ఏదో ఒక పట్టణం తీసుకుపోదామంటే వాహన సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించలేదు. దీంతో ఒడ్డుకు తెచ్చిన వెంటనే దళారులు అడిగినంతకు ఇచ్చేయడం మత్స్యకారుల వంతవుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి మత్స్యకారులు ఒడిశాలోని పారాదీప్, కర్నాటకలోని మంగుళూరు, గుజరాత్‌లోని హీరావలి తదితర తీర ప్రాంతాలకు వలసపోతున్నారు. అక్కడ కూడా సొంతంగా బోట్లు లేక కూలీలుగా మారుతున్నారు. వారి కుటుంబమంతా ఇక్కడే. ఏటా ఒకటి లేదా రెండు సార్లకు మించి రాలేని పరిస్థితి. వారు డబ్బులు పంపితేనే ఇక్కడి కుటుంబానికి పూటగడిచేది. ఇటువంటి పరిస్థితుల్లో స్థానికంగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన చాలా ఏళ్లుగా ఉంది. ఇందుకోసం పూసపాటిరేగ మండలం చింతపల్లిలో ఆరు ఎకరాల భూమి కూడా సేకరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపనకు వచ్చిన సిఎం జగన్ పనిలోపనిగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఇందుకు రూ.23.55 కోట్ల వ్యయం కేటాయిస్తున్నట్లుగా కూడా చెప్పారు. కానీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. 61 రోజుల చేపలవేట నిషేధ సమయానికి రూ.10 వేలు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దాన్నే గొప్పగా చెప్పుకుంటోంది. రేగిడి మండలం ఆర్.అముదాలవలస వద్ద రూ.కోటితో తలపెట్టిన ఆక్వా హబ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫిష్ ఆంధ్రా యూనిట్ల వల్ల చేపల వ్యాపారులకు తప్ప, తమకుగానీ, వినియోగదారులకు గానీ ఎలాంటి ప్రయోజనమూ లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమం

ఏటా నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవంగా ప్రభుత్వం జరుపుతోంది. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వహణ ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి తెలిపారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభిస్తారని సమాచారం. అనంతరం జిల్లాలో 32 మంది మత్స్యకారులకు ఒక్కొక్కటి రూ.75 వేలు విలువైన ద్విచక్ర వాహనాలు, ఒక్కొక్కటి రూ.20 లక్షలు విలువైన 3 లైవ్ ఫిష్ రవాణా వాహనాలను పంపిణీ చేయనున్నారు. ఇంతటితో సరిపెట్టుకుంటే తమ వెతలు తీరేదెప్పుడు అంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్ ప్రమాదంలో భోగాపురం మత్స్యకారుల బోట్లు ఆహుతి

విశాఖ వెళ్లి బాధితులను పరామర్శించిన టిడిపి, జనసేన

ప్రజాశక్తి- భోగాపురం

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో భోగాపురం మండలంలోని మత్స్యకారులకు చెందిన 12 బోట్లు కాలిపోయాయి. మరికొన్ని పాక్షికంగా ప్రమాదానికి గురయ్యాయి. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన మూడు బోట్లు, చేపలకంచేరుకు చెందిన ఏడు బోట్లు, ఎర్రముసలయ్యపాలెం మత్స్యకారులకు చెందిన రెండు బోట్లు ప్రమాదంలో కాలిపోయినట్లు చెబుతున్నారు. చేపలకంచేరు సర్పంచ్ అరజిల్ల నర్సింగరావుకు చెందిన రెండు బోట్లు, కారి ముసలోడు, బొడ్డు అప్పన్న, బూలోకం, మైలపల్లి గురువోజి, అరజిల్ల బుడ్డోడుకు చెందిన బోట్లు ఉన్నాయి. ఒక్కో బోటు విలువ సుమారు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. మండలంలోని మత్స్యకార గ్రామాలకు చెందిన మత్స్యకారులు విశాఖ వలస వెళ్లి అక్కడ జీవనం సాగిస్తుంటారు. అప్పులు చేసి తయారు చేసిన బోట్లు ఇలా కాలిపోవడంతో భాదితులు విలపిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, జనసేన నాయకులు లోకం మాధవి.. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు.



విశాఖలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

మత్స్యకారులకు ప్రభుత్వ పరంగా న్యాయం చేయాలని, ఈ ఘటనకు పాల్పడిన వారిని పట్టుకొని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధితులను ఆదుకోవాలి

విజయనగరం కోట : భోగాపురం మండలానికి చెందిన 12 బోట్లు కాలిపోయిన బాధిత మత్స్యకారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యంత సున్నితమైన ఫిషింగ్ హార్బర్‌లో ప్రాంతంలో భద్రతాచర్యల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టి, కారణాలు వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ పోరాట విజయం

- కలెక్టర్, జెసి, విద్యా శాఖ అధికారులతో చర్చలు సఫలం
- నిరవధిక దీక్షలు విరమణ
- 25న విద్యాశాఖ అధికారులతో సమావేశం
- నేటి చలో కలెక్టరేట్ వాయిదా



దీక్షలను విరమింపజేస్తున్న విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ చేసిన పోరాటానికి జిల్లా అధికార యంత్రాంగం దిగొచ్చింది. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ, సంక్షేమ శాఖ అధికారులతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చర్చలు జరిపారు. చర్చల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ మాట్లాడుతూ ఆగస్టులో ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన సైకిల్‌యాత్రలో గుర్తించిన సమస్యలను వివరించారు. స్పందించిన అధికార యంత్రాంగం ఈ నెల 25న విద్యా శాఖ అధికారులందరితో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశ అనంతరం పది రోజుల్లో జిల్లా యంత్రాంగం చేతుల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిరవధిక దీక్షలను విరమించేందుకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకత్వం అంగీకరించింది. అనంతరం డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఆర్‌ఐఒ ఆదినారాయణ, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి రామానందం వచ్చి దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రామ్మోహన్ మాట్లాడుతూ పోరాటానికి మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు.

దీక్షలకు పలువురి మద్దతు

విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు నాలుగో రోజు సోమవారం పలువురు మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలకు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దెల ప్రవీణ్ కుమార్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు వేముల చైతన్యబాబు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్ సంఘీభావం తెలియజేశారు. దీక్షా శిబిరాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ దయానంద్, ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుఎస్ రవికుమార్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు సందర్శించి, మద్దతు తెలిపారు. విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

జిల్లా అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు

చోదకశక్తిగా భోగాపురం ఎయిర్‌పోర్టు • నీతిఆయోగ్ సమావేశంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం



నీతిఆయోగ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లాలో పలు రంగాలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా రానున్న కాలంలో మరింత వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. జిల్లా అభివృద్ధికి చోదకశక్తిగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందని, రానున్న రోజుల్లో దీని కేంద్రంగానే అభివృద్ధి అంతా ఉంటుందని తెలిపారు. నీతిఆయోగ్ ఆధ్వర్యంలో గ్రోత్ హబ్‌లపై విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో సోమవారం విశాఖ పరిసర ప్రాంత జిల్లాల కలెక్టర్ల సమావేశం నిర్వహించారు. విశాఖను గ్రోత్ హబ్‌గా రూపొందించాలని నీతిఆయోగ్ నిర్ణయించిన నేపథ్యంలో విశాఖ పరిసర ప్రాంత ఎనిమిది జిల్లాల కలెక్టర్లతో ఆయా జిల్లాల్లో వృద్ధికి గల అవకాశాలపై అధికారులు సమీక్షించారు. అందులో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి విజయనగరం జిల్లాలో అభివృద్ధి అవకాశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఉద్యాన పంటలకు పలు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా జిల్లాలో వాటి విస్తీర్ణాన్ని పెంచడం, ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు సహకారం ఇవ్వాలన్నారు. పర్యాటక రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా ఈ రంగంలో మరిన్ని ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రమం ఏర్పాటవుతున్న నేపథ్యంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న స్థిరాస్తి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు తగిన చర్యలు చేపట్టడం ద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పెంపొందించడంతోపాటు ప్రభుత్వానికి కూడా మంచి ఆదాయం లభిస్తుందన్నారు. గత ఏడేళ్ల కాలంలో వివిధ రంగాల్లో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, సేవల, స్థిరాస్తి, నిర్మాణ రంగాల్లో జిల్లా సాధించిన అభివృద్ధిని గణాంకాల రూపంలో వివరించారు. వృద్ధికి కీలకమైన ఈ రంగాల్లో ఏవిధమైన ప్రోత్సాహకాల ద్వారా రానున్న కాలంలో జిల్లా అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లగలమనే అంశాలపై కలెక్టర్ తన ప్రజంటేషన్‌లో వివరించారు. జిల్లాలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. సమావేశానికి సిపిఒ పి.బాలాజీ కూడా హాజరయ్యారు. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి అన్నా రాయ్, సలహాదారు పార్థసారథి రెడ్డి, మెకన్సీ కంపెనీ ప్రతినిధి అభిలాష్, ప్రణాళిక శాఖ కార్యదర్శి గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు 241 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ నిర్వహించారు. ఇందులో 241 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు బి.సుదర్శనదొర, కె.ఆర్.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం కోసం పంపించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా గ్రీవెన్స్‌లో వినతులు అందించారు. మొత్తం 241 వినతులు అందగా ఇందులో అధికంగా రెవెన్యూకు సంబంధించి 173 అర్జీలు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల సమస్యలపై 25, డిఆర్‌డిఎ, పంచాయతీరాజ్ శాఖలకు 10 చొప్పున, హౌసింగ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలకు 7 చొప్పున, డిసిహెచ్‌ఎస్‌కు 2 వినతులు అందాయి.



జెసికి వినతి అందిస్తున్న టిడిపి నాయకులు

వాగు ఆక్రమణపై ఫిర్యాదు

నగరంలోని పూల్‌బాగ్ కాలనీ, డబుల్ టిన్ కాలనీ ప్రాంతంలో గెడ్డ వాగు ఆక్రమణకు గురికాకుండా చూడాలని టిడిపి నాయకులు స్పందనలో ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, కర్రోతు నర్సింగరావు, కార్యదర్శి బంగారు బాబు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

విజయనగరం మండలం గొల్లలపేటలో పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ ఈగల సత్తిబాబు ఆధ్వర్యాన స్పందనలో వినతి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

విజయనగరం టౌన్ : వైఎస్ఆర్‌నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన నాయకులు గురాన అయ్యలు.. స్పందనలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పిడుగు సతీష్ , టి.రామకృష్ణ, కాటం అశ్విని, పితాల లక్ష్మి, ఏంటి రాజేష్, ఎల్ .రవితేజ పాల్గొన్నారు

జగన్‌ది నయవంచన

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్

వైసిపి అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్మికుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. మున్సిపల్ కార్మికులను అవుట్ సోర్సింగ్‌కు మార్చి ద్రోహం చేస్తే.. సిఎం జగన్మోహన్‌రెడ్డి వారిని ఆప్కోస్‌లో చేర్చి నయవంచన చేశారని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన నిరసన దీక్షలను సుబ్బరావమ్మ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులవి గొంతెమ్మ కోరికలు కాదన్నారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పట్టణాలను పరిశుభ్రం చేసి, ప్రజారోగ్యాన్ని సంరక్షిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడింది మున్సిపల్ కార్మికులేనని గుర్తుచేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతున్నామని, ప్రభుత్వం స్పందించకుంటే కలిసివచ్చే సంఘాలతో డిసెంబర్‌లో నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. దీక్షలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, శ్రామిక మహిళా నాయకురాలు బి.సుధారాణి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుఎస్ రవికుమార్ మద్దతు తెలిపి, మాట్లాడారు. దీక్షలో గౌరీ, భాస్కర్‌రావు, ఆదినారాయణ, బాబురావు, చంద్రరావు, లక్ష్మి, దుర్గారావు, పైడిరాజు, రాఘవ, వంశీ, శ్రీను, రామారావు, రజిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో రూ.46 లక్షలతో తలపెట్టిన రహదారులు, కాలువల నిర్మాణ పనులకు సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్రీకారం చుట్టారు. 6వ డివిజన్లో సిఆర్ నగర్‌లో రూ.18 లక్షలతో, జొన్నగుడ్డి ప్రాంతంలో 4.50 లక్షలతో, పద్మావతినగర్ రెండో లైన్‌లో రూ.18 లక్షలతో, 33వ డివిజన్ ఐనాక్స్ ప్రాంతంలో రూ.5.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, ఎన్ని లక్ష్మణరావు, ఎవర్ణ విజయలక్ష్మి, జివి రంగారావు, వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, ఆల్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరం : మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు తెలిపారు. వారి సమస్యలపై తమకు వినతిపత్రం ఇస్తే, దానిపై తగిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఎవరైనా అపాయింట్‌మెంట్ తీసుకొని తన వద్దకు వచ్చి సమస్యలను వివరించవచ్చని చెప్పారు. ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా స్పందించడం లేదన్నది వాస్తవం కాదని, తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, మిగిలినవి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని తెలిపారు. సిబ్బంది ఎవరిపై అయినా ఆరోపణలు ఉంటే, తనకు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇస్తే, దానిపై విచారణ చేయిస్తామని చెప్పారు. ఇటీవల కొంతమంది చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. బోర్డు మీటింగులకు బోర్డు సభ్యులకు మాత్రమే సమాచారం ఇస్తామని, వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మాజీ సైనికుల పట్ల ఎంతో గౌరవంగా వ్యవహరిస్తున్నామని, వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

అర్హులంతా ఓటర్లుగా చేరాలి

విజయనగరం : జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. ఇప్పటికే తమ పేరు జాబితాలో నమోదు చేసుకున్నట్లయితే దానిని సరిచూసు కోవాలన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రచారోద్యమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితాలో తాను కూడా పేరు నమోదు చేసుకున్నానని పేర్కొంటూ ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌పై సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవడంతోపాటు ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతగా పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతం చేపట్టిన సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు లేనివారు కొత్తగా నమోదు చేసుకోవడం, ఇప్పటికే పేర్లు కలిగి ఉండి చిరునామాలు, ఒక చోటు నుంచి వేరొక చోటికి ఓటు మార్పు, ఓటరు గుర్తింపుకార్డులు పొందడం వంటి సేవలు పొందవచ్చన్నారు. ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎఒ దేవ్‌ప్రసాద్, తదితరులు ప్రచార వాల్‌పోస్టర్‌పై సంతకాలు చేశారు.



వాల్‌పోస్టర్‌పై సంతకం చేస్తున్న జెసి

22న కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 22న స్థానిక సిటిక్లబ్‌లో కబడ్డీ జిల్లా మహిళా జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కెవి ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు వచ్చిన క్రీడాకారులు 75 కిలోల బరువు ఉండాలని చెప్పారు. ఎంపికైన వారు ఈ నెల 29 నుంచి ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన కర్నూలులో నిర్వహించే సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు క్రీడాకారులు ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

టి20 మ్యాచ్‌కి స్కోరర్‌గా తోట విజయ్

విజయనగరానికి చెందిన బిసిసిఐ స్కోరర్ తోట విజయ్‌ను ఈనెల 23న భారత్, ఆస్ట్రేలియా మధ్య విశాఖపట్నంలోని డాక్టర్ ఎసిఎ -విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కి అధికారిక స్కోరర్‌గా నియమించినట్లు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే విజయ్ 10 వన్డే, 4 టి20, 2 టెస్ట్, 13 ఐపిఎల్ మ్యాచులకు బాధ్యతలు నిర్వర్తించారు.

బాధితులకు ఆర్థిక సాయం

లక్కవరపుకోటలో గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన ఐదుగురు బాధితులకు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు. ఆదివారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పరామర్శించిన ఆయన అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం బాధిత కుటుంబానికి జిల్లా పరిషత్తు నిధుల నుంచి రూ.50 వేల చెక్కును అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట,టౌన్


గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగల పోతన్న కోరారు. సోమవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకతపై ఏర్పాటుచేసిన సదస్సులో పోతన్న మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రతి గ్రామం, ప్రతి వీధిలో ఉంటే విజ్ఞానం పెరిగి దేశం పురోభివృద్ధిలో నడుస్తుందన్నారు. ఈ సంవత్సరం జయంతి రామలక్ష్మణమూర్తి స్మారక పురస్కారాన్ని బాడంగి శాఖా గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్‌కు ఇస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి బి.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎ.గోపాలరావు, అబ్దుల్ రవూఫ్, భాష, సహాయ గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. నవ్యాంధ్ర గ్రంథాలయ వ్యవస్థాపకులు పి.షణ్ముఖరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి విశ్వం, జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ గంధ్రేటి శ్రీనివాసరావు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, వసుమతి సన్యాసిరావు, బసవమూర్తి, ఆర్‌ఎంపి వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, కెవి రమణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న రొంగలి పోతన్న

ప్రతి విషయాన్ని ఆకలింపు చేసుకోవాలి

విద్యార్థులు ప్రతి విషయాన్ని ఆకలింపు చేసుకోవాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు తెలిపారు. గాజులరేగ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు భాషా సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు, విశ్రాంత ఉద్యోగి నూతి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అధికారి ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేస్తున్న గేదెల రాజారావు

బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు అన్నారు. మండలంలోని సీతారామునిపేట గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పంట పొలాల్లో రైతుల వద్దకు వెళ్లి చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో పత్రాలను, భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గేదెల రాజారావు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం భ్రష్టు పట్టి పోయిందని వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ రావడంపైన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దన్నాన శ్రీరాములు, తాళ్ళపూడి రామకృష్ణ, కళ్యాణం నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

రేగిడి: సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా శాఖల కార్యాలయాల్లో మమేకమై పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వీరితోపాటు హౌసింగ్ ఎఇ జగన్నాథరావు ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

రామభద్రపురం: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి, పగలు సాగునీటి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నా కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని చెప్పారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మండలాన్ని కరువు మండలంగా వెంటనే ప్రకటించాలని కోరారు. వైసిపి పాలనలో ప్రజలు పూర్తిగా విసుగు చెందారని రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఓడించాలనే కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించలేని ఈ ప్రభుత్వానికి బస్సు యాత్రలు చేసే అర్హత లేదని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమని, బొబ్బిలి నియోజక వర్గం నుంచి బేబీనాయన భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని జోస్యం పలికారు. ఈ సమావేశంలో సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, పార్టీ నాయకులు వసంతుల తిరుపతిరావు, పూడి రామి నాయుడు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

విఒఎ కుటుంబానికి ఆర్థిక సాయం

లక్కవరపుకోట: మండలంలోని కల్లేపల్లి గ్రామ పంచాయతీకి చెందిన వెలుగు బుక్కకీపర్ (విఒఎ) గోకాడ మహేశ్వరి అదే పంచాయతీకి చెందిన మరో బుక్కకీపర్ గాడి విన్నతల్లి చేతిలో హత్యకు గురైన సంఘటన విధితమే. ఈ మేరకు లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి, శృంగవరపుకోట మండలాలకు చెందిన విఒఎలు చందాల రూపంలో రూ. 50 వేలు సమకూర్చారు. ఆ నగదును మృతురాలి భర్త నాయుడుకు స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, కల్లేపల్లి సర్పంచ్ గోకాడ ముసలినాయుడు, ఎంపిటిసి సభ్యులు స్వామినాయుడు, ఉత్తరాపల్లి అప్పలరాజు, కొత్తవలస ఎఎంసి డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, ఎల్ కోట, కొత్తవలస, జామి ఎపిఎంలు టి అప్పలనాయుడు, సూర్యనారాయణ, పాల్గొన్నారు.

వేపాడ ఎంఇఒగా జగదీశ్వరరావు

వేపాడ: మండల విద్యాశాఖకు ఇంచార్జి ఎంఇఒగా గంధవరపు జగదీశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇంచార్జి ఎంఇఒగా పనిచేసిన కొత్తవలస ఎంఇఒ శ్రీదేవిని ఇంచార్జి బాధ్యతలు నుండి తప్పించి ఆమె స్థానంలో ఎస్‌కోట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గంధవు జగదీశ్వరరావుకు బాధ్యతలు అప్పగించారు.

'ఆడుదాం ఆంధ్ర' పై అధికారులతో సమీక్ష

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఎంపిడిఒ బిఎస్‌ఎన్ పట్నాయక్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 15 సంవత్సరాలు పూర్తి అయిన వారిని ఎంపిక చేసి వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఈ నెల 22న కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయానికి వస్తున్నారన్నారు. 27న నుంచి 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభమవుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు సిద్ధంగా చేయాలని సూచించారు. ఇంతవరకు మరుగుదొడ్లు లేని వారిని గుర్తించిన వివరాలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారిని ఉమా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

బొబ్బిలి: విద్యా రంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా బొబ్బిలి పట్టణంలో విద్యార్థులు బొబ్బిలి సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణానికి దూరంగా ఉన్న ఎస్‌టి బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాన్ని పట్టణంలోనికి తీసుకురావాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌కి సొంత భవనాలు కేటాయించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.మణికుమార్, నాయకులు కిరణ్, తేజ, వినయ, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

బొబ్బిలి: పట్టణంలో ఈ నెల 23న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, బొబ్బిలి మునిసిపాలిటీ సచివాలయాల జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి కోరారు. సోమవారం వార్డు కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

లోతట్టు ప్రాంతాల్లో స్నానానికి వెళ్లొద్దు

వంగర: మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న త్రివేణి సంగమం వద్ద లోతట్టు ప్రాంతాలకు స్నానాలకు వెళ్లొద్దని ఎస్‌ఐ ఆర్. జనార్దనరావు తెలిపారు. నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదుల కలిసే త్రివేణి సంగమం వద్ద కొన్ని ప్రదేశాల్లో లోతట్టు ప్రాంతాలు ఉన్నాయని ఆయా ప్రాంతాలలో యాత్రికులు స్నానాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

శృంగవరపుకోట: మండలంలోని మూల బొడ్డవర పంచాయతీకి చెందిన మరుపల్లి గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం ఇళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్.కోట సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ప్రతినిధులు సోమవారం పరామర్శించి సంస్థ తరఫున తార్పాలిన్, చీరలు, దుప్పట్లు, తువ్వాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంసి మెంబర్ దొడ్డి సూర్యారావు, ఎస్.కోట సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి. వరలక్ష్మి, కోశాధికారి శ్రీధరేల వెంకన్న బాబు, ఎంసి మెంబర్ జోగారావు మాస్టర్, కార్యదర్శి జి ధనుంజయ్ పాల్గొన్నారు.

దన్నానపేటలో పంట కోత ప్రయోగం

నెల్లిమర్ల: దన్నానపేటలో వ్యవసాయ శాఖ పంట కోత ప్రయోగం చేసింది. సోమవారం లెంక సత్యనారాయణ వరి పొలంలో ఎ. ఎం.పూర్తిమ యూనిట్ 0456 పంట కోతప్రయోగం ప్రక్రియ పరిశీలించారు. ఎకరాకు 25.475 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని గుర్తించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు హరిశ్చంద్ర, కారు కొండ శ్యామ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జాకేరు, ఓబలయ్య పాలెం గ్రామాలలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. రైతు అప్పారావు భూమిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎడి, విఎఎలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- గంట్యాడ

పుస్తక పఠనం వల్ల పరిజ్ఞానం పెరుగుతుందని గంట్యాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ అన్నారు. శాఖ గ్రంథాలయాధికారి బి రామభద్రరాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు ఆమె చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి అల్లు జ్యోతి, గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గంగాధరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కవరపుకోట :** మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 56వ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్యారమ్స్, వ్యాసరచన, డిబేట్, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఎంఇఒ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లైబ్రరియన్ బి మేరీనిర్మల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పతివాడ సతీష్, కే సునీత, మహేష్, రాజుతోపాటు కస్తూరిభా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. **రేగిడి:** పుస్తక పఠనంతో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల క్రీడ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ డి.నాగమణి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు వి.సూర్యనారాయణ, జి రామ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. **డెంకాడ:** గ్రంథాలయాల్లో చదువుకుని చాలామంది ఉన్నత శిఖరాల అధిరోహించారని మరి కొంతమంది కాంపిటీషన్ పరీక్షల్లో ఉత్తీర్ణతలు సాధించారని పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనక సింహాచలం తన


డెంకాడ: ప్రశంసా పత్రాలను అందిస్తున్న రొంగలి కనక సింహాచలం

భార్య సత్యవతి పేరు మీద రూ.3వేలు విలువైన బహుమతులను గెలుపొందిన విద్యార్థులకు అందజేశారు. బాగా చదువుకునే విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయానికి అందజేస్తానని చెప్పారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరీ, లైబ్రేరియన్ వై మహేష్, రిటైర్డ్ లైబ్రేరియన్ డి దేవుడు, జిల్లా పరిషత్ పాఠశాల సోషల్ టీచర్ కెవి సుధాకర్, నాయకులు రొంగలి గోపాలకృష్ణ, శ్రీ సత్య స్మార్ట్ స్కూల్ సిబ్బంది, వశిష్ట స్కూల్ సిబ్బంది, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.
నెల్లిమర్ల: జరజాపుపేట గ్రామీణ గ్రంథాలయంలో నిర్వాహకురాలు జె. నారాయణమ్మ అధ్యక్షతన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు మానవ జీవన మనుగడకి విద్యాలయాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షులు కడలి ప్రకాశరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుంకరి వాసుదేవరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు పాండ్రకి సత్యనారాయణ, తుమ్మ నారాయణమూర్తి, నల్లి శ్రీనివాసరావు, నల్లి శివ, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 53వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, అందులో గెలుపొందిన వారికి చైర్ పర్సన్ బంగారు సరోజిని చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గతవారం రోజులుగా నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు సోమవారం ముగిశాయి. సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి, ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం వెంకటలక్ష్మి హాజరై వారోత్సవాల్లో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రంథాలయంలో చదువుకుంటూ ఆర్‌ఆర్‌బిలో ఉద్యోగం పొందిన పట్టణానికి చెందిన మోపాడ మోహన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ- 2 పాదం గణేష్ లక్ష్మి, ఉపాధ్యాయులు వి. మల్లేశ్వరి, ఎస్. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **పూసపాటిరేగ:** గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం ముగింపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు నేటి తరానికి దిక్సూచిగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, హైస్కూల్ హెచ్‌ఎం బి. శంకరావు, పెద్దలు పివిఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. **తెర్లాం:** స్థానిక శాఖ గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ముంగిపు కార్యక్రమలో ఎంఇఒ జె. త్రినాధరావు, స్థానిక ఎస్‌ఐ ఆర్ రమేష్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ ఎం సత్యనారాయణ, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎస్. రమేష్, క్రాఫ్ట్ టీచర్ విస్సు, వెంకటేశ్వర కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతిరావు, టి రామారావు, అంగన్వాడి టీచర్ వై శ్రీదేవి, పిఇటిబి నారాయణ నాయుడు పాల్గొన్నారు.

'పథకాలే జగన్‌ను మళ్లీ సిఎంను చేస్తాయి'

ప్రజాశక్తి- భోగాపురం

పేదలకోసం ప్రవేశపెట్టిన పథకాలే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపిస్తాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బైరెడ్డిపాలెం పంచాయతీలో గడపగడపకు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బైరెడ్డి రాజు, జేసిఎస్ కన్వీనర్ యర్రప్పలనారాయణరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి గడగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. అనంతరం ఇదే సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పథకాలను తెలిపే డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొయ్య సంతోషి, నాయకులు పడాల శ్రీనివాసరావు, భాను, కొల్లి రామ్మూర్తి, సుందర హరీష్, లక్ష్మణ్, ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దారు బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : పేద ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం ఆలోచించేది ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. సోమవారం మండలంలోని గొట్లాం సచివాలయ ఆవరణంలో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి జగనే ఎందుకు కావలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే


భోగాపురం: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందిచాలానే ధ్యేయంతో జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. ఒక్కసారి అధికారంలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఉద్యోగాలను అమ్ముకున్నారని అప్పలనరసయ్య ఆరోపించారు. అభివృద్ధి పేరిట దోచుకొని దాచుకున్నారని విమర్శించారు. అనంతరం వైసిపి జెండాను ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపాక సూర్య ప్రకాశ రావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, సీనియర్ వైసిపి నాయకులు మీసాల తులసీరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** మండలంలోని డిఆర్‌పేటలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపిపి డి. సత్యవంతుడు పాల్గొని మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందజేయలేదని, గ్రామ వాలంటరీ వ్యవస్థను పెట్టి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నామన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, గ్రామ సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ, ఎంపిటిసి శామంతుల లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు ఎం జగ్గు బాబు తదితరులు పాల్గొన్నారు. **గజపతినగరం:** సంక్షేమం, అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. సోమవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని కాలంరాజుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, కరణం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** మండంలోని కొండగుంపాం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఎంపిపి అంబళ్ళ సుధారాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పి. సత్యన్నారాయణ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, సర్పంచ్ పతి వాడ అప్పన్న, ఎంపిడిఒ జి. రామారావు, ఇఒపిఆర్‌డి కె. సింహాద్రి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

అందరికీ ఉచిత వైద్యం ప్రభుత్వ విధానం:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గజపతినగరం

అందరికీ ఉచిత వైద్యం అందించడమే తమ ప్రభుత్వ విధానమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. సోమవారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో ఎక్స్‌రే, రక్త పరీక్షల ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దానిలో భాగంగానే రూ.45 లక్షలు విలువగల పరికరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచులు మండల సురేష్, బెల్లాన త్రినాధ రావు, కరణం ఆదినారాయణ, డాక్టర్ బెజవాడ సతీష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్‌పై హర్షం

ప్రజాశక్తి - వేపాడ

స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ రావడంపై టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆదేశాలతో టిడిపి మహిళా సంఘాల అవగాహన ప్రధాన కార్యదర్శి, బానాది ఎంపిటిసి గొంప తులసి ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **గరివిడి:** చంద్రబాబుకు హైకోర్టులో బెయిల్ రావడం పట్ల టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇది టిడిపి శ్రేణులకు పండగ రోజు అని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు, మహంతి అప్పలనాయుడు, ముల్లు రమణ, రౌతు నారాయణ రావు, గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **బాడంగి :** చంద్రబాబుకు బెయిల్ వచ్చిన సందర్భంగా రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ, ఎంపిటిసి పాలవలస గౌరు ఎరుకుల పాకలు గ్రామంలో బాణా సంచ కాల్చి సంబరాలు చేశారు. **శృంగవరపుకోట:** ఎన్ని కేసులు పెట్టిన చంద్రబాబు మచ్చలేని నాయకుడిలా బయటకొస్తారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వడంతో సోమవారం పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలసి స్వీట్లు పంచిపెట్టి బాణాసంచ కాల్చి


వేపాడ: సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో జామి, కొత్తవలస, వేపాడ టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, గొరపల్లి రాము, గొంప వెంకటరావు, నాయకులు రాయవరపు చంద్రశేఖర్, గుమ్మడి భారతి, గొంప తులసి, తదితరులు పాల్గొన్నారు. **విజయనగరం కోట :** స్థానిక అశోక్ బంగ్లా వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు పి.లక్ష్మీవరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు పాల్గొన్నారు.. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యాన టిడిపి నియోజకవర్గ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచుకుని, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో దాట్ల రవిరాజ్, మాజీ జెడ్‌పిటిసి తుంపిల్లి రమణ, భాను ప్రకాష్, కెల్ల సూరిబాబు, గొగుల రమేష్, చిప్పాడ స్వామి, మద్దిల ప్రవీణ్, గోగుల ప్రణయి, అంబళ్ళ సూర్యప్రకాష్ రావు, మీసాల సూరిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాడ్యుటి పెన్షన్ అమలు, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ల పిలుపులో భాగంగా డిసెంబర్ 8 నుండి నిర్వహించే నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నామంటూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పిఒ రమాకి సోమవారం సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 8 నుండి అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేయాలని సిఐటియు ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ యూనియన్ల పిలుపుతో సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.
గజపతినగరం: అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం గజపతినగరం ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేసి సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, మాట్లాడుతూ అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర ఏళ్ల కాలంలో అనేక


శృంగవరపుకోట: సమ్మె నోటీసు ఇస్తున్న మద్దిల రమణ

పోరాటాలు నిర్వహించారు కానీ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 8వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు పిఒకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి పి జ్యోతి, అధ్యక్షులు ఎం సుభాషిని, సన్యాసమ్మ, నాగమణి, నారాయణమ్మ, సుజాత, రవణమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఐడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ విజయలక్ష్మికి సోమవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ యూనియన్ నాయకులు పి. నిర్మల, సిహెచ్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు నెల్లిమర్ల క్రీడాకారులు ఎంపికయ్యారని రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు సోమవారం తెలిపారు. నగర పంచాయతీకి చెందిన తాడ్డి లావణ్య, సోమాదుల భాను, తామాడ భవానీ, గుర్రాల భువన అంతర్ విశ్వ విద్యాలయాల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 22 నుంచి 25 వరకు తమిళ నాడు రాష్ట్రం కరైకుడి అలగప్ప యునివర్సిటీలో జరగనున్న కబడ్డీ పోటీల్లో వీరు ఆంధ్ర యూనివర్సటీ తరపున ప్రాతినిధ్యం వహించి ఆడుతారని తెలిపారు. వీరిని పీడీతో పాటు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు బొని సూర్య నారాయణ, పెద్దలు అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేత ఆదినారాయణకు అభినందన

ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బి.బి.ఎ విద్యార్థి ఆదినారాయణ బంగారు పతకం సాధించడం పట్ల సోమవారం వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అభినందించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ డైరెక్టర్ అండ్ డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ఎస్. వర్మ మాట్లాడుతూ ఆదినారాయణ జూనియర్, సీనియర్ 81 కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్‌లో 137 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 157 కిలోలు బరువులెత్తి మొదటి స్థానం కైవసం చేసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కోచ్ అర్జున్, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కొప్పెర్ల విద్యార్థులు

పూసపాటిరేగ: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొప్పెర్ల గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు. కె. అజయ్‌కుమార్, ఎ. రాజు, బి. శ్రావణ్‌కుమార్‌లు ముగ్గురు ఆంధ్రప్రదేశ్ తరపున ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ నెల 15, 16, 17 తేదిల్లో కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్ - 19 విబాగంలో జిల్లా తరుపున కొప్పెర్ల పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు పాల్గొన్నారని వీరంతా రాష్ట్ర స్థాయిలో మంచి ప్రదర్శన చూపడంతో విజయనగరం జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం లబించిందని చెప్పారు. అందులో ముగ్గురును జాతీయ స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఒకే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంపై సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్ రఘురామనాయుడు, జిల్లా కో ఆర్డినేటర్ పద్మజా, జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారన్నారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి ఆంధ్ర ప్రదేశ్‌కు మంచి పేరుతీసుకు రావాలని కోరారు. విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇచ్చినందుకు పీడీ కృష్ణను, పిఇటి సత్యనారాయణను అభినందించారు.

నాణ్యతా లోపంపై బేబినాయన ఆగ్రహం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు, పైపులైన్ నాణ్యత లోపంపై టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బలిజిపేట రోడ్డును పరిశీలించిన అనంతరం కోటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిజిపేట రోడ్డు, పైపులైన్ పనులు చేసిన సమయంలో ఆర్భాటం చేసిన కాంట్రాక్టర్, వైసిపి నాయకులు నాణ్యత పాటించలేదన్నారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో రోడ్డు పాడైపోతుందన్నారు. పైపులైన్ పనుల్లో నాణ్యత లేకపోవడంతో ఎక్కడికక్కడే పైపులైన్ లీకు అవుతుందన్నారు. పనుల్లో నాణ్యత పాటించకుండా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని విమర్శించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుండా ఆర్భాటాలకు వెళ్లడం సిగ్గు చేటన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోతే అధికారులు ఎలా బిల్లులు చెల్లించారని ప్రశ్నించారు. పైపులైన్ లీకులతో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించని కాంట్రాక్టర్ నుంచి రికవరీ పెట్టాలని, కాంట్రాక్టర్ సొంత సొమ్ముతో మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయనతో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, నాయకులు ఉన్నారు.

ఉత్తమ గ్రంథాలయాధికారిగా ఈశ్వరరావు

ప్రజాశక్తి- రేగిడి

మండల శాఖా గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న పెంట ఈశ్వరరావు ఉత్తమ గ్రంథాలయాధికారిగా ఎంపికయ్యారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉత్తమ గ్రంథ పాలకుడుగా ఎంపిక కావడం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సువ్వారి సువర్ణ, కార్యదర్శి బి.కుమార్ రాజు, చైర్ పర్సన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావులు దుస్సాలువాలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. గ్రంథాలయం ద్వారా ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తామని చెప్పారు.

నాటు సారాతో పట్టుబడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి వంగర

రాజాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నిర్వహించిన దాడుల్లో మండలంలోని వివిఆర్ పేట గ్రామానికి చెందిన బొత్స సుమన్ 20 లీటర్ల నాటు సారాతో పట్టుబడటంతో ఆయన్ను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఇబి సిఐ బి శ్రీధర్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్ పిచ్చేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు

- 17 గొర్రెలు మృతి
- 30కు పైబడి గాయాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని సోంపురం జంక్షన్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున గొర్రెల మందపై గుర్తు తెలియని కారు దూసుకెల్లడంతో 17 గొర్రెలు మృతి చెందగా మరో 30 గొర్రెలకు పైబడి గాయాలపాలయ్యాయి. ఎస్‌కోట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు వారాధి అప్పలి, వారధి బంగారయ్య, బొబ్బిలి గోవింద, యండపల్లి శ్రీను తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా సబ్బవరం నుండి సుమారు 300 గొర్రెలను వాళ్ల స్వగ్రామానికి తోలుకొని వెళుతుండగా విశ్రాంతి కొరకు ఆదివారం రాత్రి సోంపురం జంక్షన్ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో గొర్రెలను నిలుపుదల చేశారు. అర్ధరాత్రి 2.15 గంటల ప్రాంతంలో తమ స్వగ్రామాలకు బయలుదేరి గొర్రెల మందను రోడ్డు ఎక్కిస్తుండగా శృంగవరపుకోట వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే 17 గొర్రెలు మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెలకు పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి పోస్టుమార్టం నిర్వహించారు. కాళ్లు విరిగి గాయాలపాలైన 30


మృతి చెందిన గొర్రెలు

పైబడి గొర్రెలకు వైద్యం అందించారు. ఈ ఘటనపై ఎల్ కోట పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.